

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

– డా. నందమూరి లక్ష్మీపార్వతి



డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు - భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు - కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!

## (ప్రారంభం)

**ఎన్.టి.ఆర్ జీవితం: కళాసేవ**

నటన జీవితం కాదు. జీవితం నటన కాదు. కానీ నటించిన పాత్రలన్నింటిలోని ఉదాత్తతనంతా తనలో రంగరించుకుని, తన ఆత్మ సంస్కారంలో అంతర్నిళితమైన ఉదాత్తత వల్లనే ఆ పాత్రల నంత సజీవంగా ఆవిష్కరించారన్న కీర్తిని పొంది, తాను కాలుమోపిన ప్రతిరంగంలో తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని సముపార్జించుకున్న అత్యంత విశిష్ట వ్యక్తిత్వం నందమూరి తారకరామారావుగారిది.

నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా, ఎగ్జిబిటర్గా అశేష ప్రజల మన్ననలందుకుని తెలుగుకీర్తి కిరీటంలో కలికితురాయిగా మిగిలిపోయిన గొప్ప కళామూర్తి. కళారంగంలో ఎంతో - సామాజిక, రాజకీయ రంగంలో కూడా అంతగా అంతర్జాతీయంగా గణించతగ్గ చరిత్ర సృష్టించిన మహావ్యక్తి. తెలుగువారి ఘనకీర్తి.

మంచి నటుడు, మంచి మనిషి అవుతాడన్న ఒక ఇంగ్లీషు సూక్తికి ప్రతీక ఆయన.

నలభై దశాబ్దాల సినీరంగాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుకుని పరిశ్రమకు, నిర్మాతలకు కనకవర్షం కురిపించి ఎన్నో పాత్రలను అవలీలగా అవగాహన చేసుకోవటమే కాదు కళ్ళెదుట సజీవాకృతులుగా ఆవిష్కరింపచేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. అందులో ఎన్నో ప్రయోగాలు. ప్రతి నాయకుల్ని కూడా నాయకులుగా మలచి శభాషనిపించుకున్న నట వైదుష్యం. చరిత్రల్నే తల్లక్రిందులు చేసి ఒప్పించి మెప్పించిన ప్రయోగకర్త. ఆత్మవిశ్వాసం అసమాన ధైర్యం. మంచి చెడులను సమపాళ్ళలో జీర్ణించుకునే మొండితనం, ఎన్నో ఒడిదుడుకులమధ్య సినీ, రాజకీయరంగాల్లో సాటిలేని వాడనిపించుకున్న ఘనత వారికొక్కరికే దక్కుతుందేమో. సి.నారాయణరెడ్డిగారి మాటల్లో కూడా "అసలు నటుడిగా పైకి రావాలని రామారావుగారికి లేదు. నాకు తెలిసినంత వరకు కుటుంబ కష్టాలు - బాధ్యతలు దృష్టిలో పెట్టుకుని, చితికిపోయిన తన కుటుంబాన్ని మళ్ళీ అతకు పెట్టి పైకి తీసుకురావాలనే నిబద్ధత ఉన్నవాడు. కనుకనే ఎన్నో బాధలనుభవించికూడా మద్రాసు విడిచి పెట్టలేదు"

కృష్ణాజిల్లా బందరు తాలుకా నిమ్మకూరు కుగ్రామంలో 1923 మే 28 వ తేదీ రామారావుగారి జననం జరిగింది. ఊరి మొత్తానికి మోతుబరి రైతు పెదరామస్వామిగారు. వారి మూడవ కుమారుడు లక్ష్మయ్య గారింట తొలిపంటగా ఆవిర్భవించి, పుట్టిన పల్లెనుండి తల్లి భారతి వరకు ఎదిగిన మహర్జాతకుడు. అసలు నిమ్మకూరు గ్రామానికే ఒక చరిత్ర ఉంది. బందరు విజయవాడ ప్రధాన

రోడ్డుకు పక్కనే ఆనుకుని ఉండే ఈ గ్రామం రామారావుగారు పుట్టకముందే చాలా సంవత్సరాలకు పూర్వం ఓ సంఘటన జరగటంతో గ్రామస్తులంతా కలసి ఊరును మూడు మైళ్ళలోపలికి మార్చుకున్నారు. ఆనాడు గ్రామ జనాభా 500.

గోల్కొండ నవాబుల పాలనలో సైనిక స్థావరంగా ఉన్న బందరుకు సుల్తాను సైనికులు రోజూ ఆ దారి వెంట వస్తూ పోతుండేవారట. వారి వలన ఆగ్రామంలో ఒక ఆడపడుచు మరణించటంతో స్త్రీలకు అవమానం జరగకూడదని అందరూ కూడబలుక్కుని గ్రామాన్ని బాగా లోపలికి మార్చుకోవటం జరిగింది. చాలా రోజులవరకు నిమ్మకూరు గ్రామచరిత్ర ఆ జిల్లాలో విశేషంగా చెప్పుకునేవారు.

గ్రామానికి సంబంధించిన చరిత్రలో అది విశేషమైతే, గ్రామంలో పెద్దరైతు 80 ఎకరాల సుక్షేత్రానికి అధిపతి రామారావుగారి తాతగారు రామిస్వామి చౌదరిగారి కథ మరో విశేషం - ఊరి పెద్దగానే కాదు, పౌరుషరాజసాల్లో తనకు సాటిలేడనిపించుకున్న గొప్పదాత కూడా. నందమూరి వంశానికి మణిపూస ఆయనైతే, ప్రపంచానికి వెలుగులు చిమ్మిన కోహినూరు రామారావుగారు. రామస్వామి చౌదరి గారికి నలుగురు కుమారులు. 1) రాజయ్యగారు, 2) సుబ్బయ్యగారు, 3) కథానాయకుడి కన్నతండ్రి, లక్ష్మయ్యగారు, 4) నాగయ్యగారు.

ఎన్.టి.ఆర్ గారి తల్లి వెంకట్రావమ్మగారు. వారి సోదరి చంద్రమ్మగారు. ఆమె భర్త రామయ్యగారే తారకరాముడ్ని అతి ప్రేమగా పెంచి విద్యాబుదులు చెప్పించిన తండ్రి. తనకు పిల్లలు లేకపోవటం వలన తారకరాముడ్ని దత్తు తీసుకున్నారు. ఐదేళ్ళు వచ్చేటప్పటికే సుమతీశతక, ఆంధ్ర నామ సంగ్రహం - బాలరామాయణం కొడుకు చేత పుక్కిటపట్టించటమే కాదు, ఉన్నతమైన సంస్కారాన్ని నేర్పించిన తొలిగురువు ఆయనే. ఆ గ్రామంలోనే మొదటగా తెల్లటి లాల్చీ పంచెకట్టుతో సెంటు పూసుకుని తిరిగింది కూడా ఆయనే. అందుకే అందరూ సోకురామయ్య అని పిలిచేవారు. భారత, భాగవత, రామాయాణాల్ని ఆమూలాగ్రం చదవటమే కాదు. ఆ పద్యాలు పాడి అందరికి వినిపిస్తుండేవారు. నాటకాలంటే ఆయనకు మహా సరదా.

ఎన్.టి.ఆర్.గారి కన్నతండ్రి లక్ష్మయ్యగారికి ఇవేవీ పట్టవు. తెల్లవారకముందే చద్ది తిని భుజాన నాగలివేసుకుని పొలం వెళితే ఆయన మళ్ళీ ఇంట్టికి తిరిగొచ్చేది ప్రొద్దుకుంకాకే. చాలా కష్టజీవి. దేన్నీ మనసుకు పట్టించుకోని కర్మయోగి కూడా. ఆయన వివాహం రామయ్యగారి మరదలు వెంకట్రావమ్మగారితో జరిగింది.

కాట్రగడ్డ సూరయ్యగారి పెద్ద కుమార్తె చంద్రమ్మను రామయ్యగారు వివాహమాడారు. ఆయనకు మగసంతానం లేనందువల్ల చిన్న కూతురితో సహా వచ్చి అల్లుడింట్లో నిమ్మకూరులో ఉండిపోయారు. చిన్నామే లక్ష్మయ్యగారి భార్య.

వెంకట్రామయ్యగారు సహనశీలి. దైవభక్తి ఎక్కువ. వెంకటేశ్వరస్వామి వారి ఇంటి ఇలవేల్పు. పిల్లలక్కూడా చిన్నప్పటినుండీ భక్తి అలవడటానికి ఆమే కారణం. కష్టాల్లో కూడా చెక్కు చెదరని చిరునవ్వుతో ఎంతో ఆత్మవిశ్వాసంతో సంసారాన్ని ఓర్పుగా, నేర్పుగా ఈదిన ఇల్లాలుగా ఆమెకు అందరిలో మంచిపేరుంది. ఉమ్మడి కుటుంబంలో ఉండగానే తారకరాముడు పుట్టటం జరిగింది. స్వాతి నక్షత్రం, తులారాశి, అద్భుతమైన జాతకంగా ఊరి పురోహితుడు నిర్ణయించాడు.

తారకరాముడికి రెండేళ్ళ వయసప్పుడు ఒక కోయదొర ఆ బిడ్డ వీపుమీద పుట్టుమచ్చ చూసి 'ఒకనాటికి ఆ బిడ్డ రాజ్యమేలతాడు. రాజవుతాడు. దేశానికే కీర్తి తెస్తాడు' అని చెప్పాడని రామారావుగారు చెప్పారు. ఆ తర్వాత కుటుంబంలో గొడవ మూలంగా ఆస్తులు పంచుకుని లక్ష్మయ్యగారు, భార్యాబిడ్డలతో రామయ్యగారింటికి వచ్చేసారు. అప్పటికి దాదాపుగా వారికి 20 ఎకరాల పొలం ఉంది. కాలక్రమంలో ధాన్యం ధరలు తగ్గిపోయి, కొన్న పొలం అప్పు తీర్చటానికి మూడు ఎకరాలు మినహా మొత్తం అమ్మేసారు. ఉన్న ఊళ్ళో బ్రతకలేక పశువులు కొనుక్కుని విజయవాడలో పాలవ్యాపారం మొదలు పెట్టారు.

***విద్యాభ్యాసం:***

రామారావుగారు వెంకట్రావమ్మ, లక్ష్మయ్యగార్లకు పుట్టినా, పెంచింది విద్యాబుద్దులు చెప్పించింది రామయ్యగారి దంపతులే. పుట్టగానే చందమామలా అందంగా మెరిసిపోతున్న బిడ్డను చూసి రామయ్యగారు 'మా ఇంట తారకరాముడు పుట్టాడు' అని

ఆనందంగా అన్నారట. అదే పేరు స్థిరపడిపోయింది. రెండేళ్ళ వయసున్నప్పుడే కుటుంబ కలహాల కారణంగా తల్లిదండ్రులు రామయ్యగారింటికి మకాం మార్చటంతో రామయ్యగారికి మరింత సన్నిహితమయ్యాడు. నిజానికి తొలి అక్షరాభ్యాసం చేసింది రామయ్యగారే. ప్రాథమిక విద్యకు వెళ్ళక ముందే బాలరామాయణాన్ని కంఠతా పట్టించి అందరి ముందు వినిపిస్తుండేవాడు. ఆంధ్రనామ సంగ్రహాన్ని, కొన్ని శతక పద్యాలను నేర్పించిన గురువాయన. రామయ్యగారికి చదువు విలువ తెలుసుకనుక తన కొడుకును బాగా చదివించాలని ఆశపెట్టుకున్నాడు.

రామారావుగారికి ఐదవ ఏట ఊళ్ళోనే అక్షరాభ్యాసమయింది. ఆనాడు నిమ్మకూరులో స్కూలు లేదు. నిడుమోలు గ్రామవాసి సుబ్బారావుగారు రోజూ ఆ గ్రామానికి వచ్చి పిల్లలకి విద్యాభ్యాసం చేయిస్తుండేవారు. రామారావుగారు ఆయనకు మూడోతరం శిష్యులు. రోజూ ఐదు కిలోమీటర్లు నడచి వచ్చి పాఠం చెప్పి వెళ్తుండేవారు. పిల్లలకెంతో ఓర్పుతో చదువు చెప్పేవారు. "ఈరోజు నాకు తెలుగులో ఇంత అభినివేశం, ప్రజ్ఞ ఉన్నాయంటే కేవలం మాగురువుగారు వల్లూరు సుబ్బారావుగారు చెప్పిన చదువే ప్రాథమిక కారణం. ఆయన బోధనా విధానం అటువంటిది" అంటూ అనేకమార్లు రామారావుగారు తమ అభిప్రాయం వెలిబుచ్చేవారు. సుబ్బారావుగారు పిల్లలకు చదువేకాక, ఊళ్ళో వాళ్ళకు ప్రామిసరీ నోట్లు, ఉత్తరాలు వ్రాసిపెట్టడం వంటివి కూడా చేస్తుండేవారు. అందుకు గ్రామస్తులు వెన్న, నెయ్యి, పాలు పెరుగు, కూరగాయలు దండిగా ఇచ్చేవారు. వాటిని రోజూ అంతదూరం ఆయన ఇంటికి మోసుకెళ్తుండేవారు. ఒకసారి తమ బాల్యాన్ని గుర్తు తెచ్చుకుంటూ రామారావుగారు ఇలా అన్నారు.

"నా కళ్ళు మూసుకుని ఆ రోజులు జ్ఞాపకం చేసుకుంటే మా మాష్టారు రావటం, రోజంతా మమ్మల్నందర్నీ చదివించటం, తిరిగి వారి గ్రామానికి వెళ్ళేటప్పుడు ఒక చేతిలో కూరగాయలు సంచి, మజ్జిగ చెంబు మరో చేతిలో, తలమీద బియ్యం మూట కళ్ళముందు కట్టినట్లే కనిపిస్తుంది. ఆ దృశ్యం ఎప్పటికీ మర్చిపోలేను."

ఎప్పుడయినా పండగ రోజుల్లో పెళ్ళిళ్ళ సందర్భంగా తారకరాముడి చేత బాలరామాయణాన్ని చెప్పిస్తుంటే అందరూ ముగ్ధులయ్యేవారు. సుబ్బారావుగారి శిక్షణలో ఆయన మూడు తరగతులు పూర్తి చేసుకున్నారు.

అది బ్రిటిషు పాలనలో, అనూచానంగా సాగివచ్చే భారతీయ సంస్కృతి, సంప్రదాయ వాహినిలో మార్పులు చోటుచేసుకుంటున్న సమయం. మత వ్యాప్తి కోసం తెల్లవారు ఎంచుకున్న మొదటి విధానం విద్యాబోధనలో ఆంగ్లభాష ప్రవేశ పెట్టడం. ఇంగ్లీషు విద్యావిధానం పట్ల ప్రజలు బాగా ఆకర్షితులౌతున్నారు. సంఘ సంస్కర్తలంతా ఆ భాషకు ప్రాధాన్యతనిస్తుండటంతో అది సమాజంలోని అన్ని వర్గాల మీద తన ప్రభావం చూపిస్తున్నది. మారుమూల గ్రామాలక్కూడా ఈ ప్రభావం విస్తరించసాగింది. సంధ్యావందనం కంటే వచ్చీరాని ఇంగ్లీషు మాట్లాడటమే గొప్ప ఆకర్షణ. ఆ ఆకర్షణకు సజీవ చిత్రణ మనకు కన్యాశుల్కంలో దర్శనమిస్తున్నది. ఆ ఆకర్షణ మాటెలాగున్నా, ఆంగ్లవిద్యవల్ల సామాజిక, ఆర్థికరంగంలో గొప్ప పరివర్తన సంభవిస్తుందని అందరూ విశ్వసించారు. రామయ్యగారు కూడా ఆ విశ్వాస ప్రభావాన్ని తప్పించుకోలేకపోయారు. తన దత్తపుత్రుడికి ఆంగ్ల విద్యాబోధన జరగాలనే పట్టుదల కలిగింది. పైగా ఉన్నత చదువులు చదివి, పెద్ద ఉద్యోగం చెయ్యాలంటే ఇంగ్లీషు తప్పనిసరిగా అనే అభిప్రాయానికి వచ్చారు. పాశ్చాత్య వ్యామోహంతోనే ఆ గ్రామంలో మొదటగా కోటు తొడిగింది ఆయనే. అందుకే అవురుపూడి మునసబుగారింట్లో నడుస్తున్న బడిలో ఇంగ్లీషు నేర్పిస్తున్నారని తెలిసి రోజూ కొడుకును భుజం మీద కూర్చోపెట్టుకుని తీసుకెళ్ళి తీసుకొస్తుండేవారు. బాలరాముడికి అక్కడ నాలుగు, ఐదు తరగతుల చదువు పూర్తయింది. ఆ పైన ఎక్కడ చదివించాలనే చర్చవచ్చింది. లక్ష్మయ్యగారు 'ఇకచాలు చదివింది, వ్యవసాయం పనుల్లోకి దింపమ'ని చెప్పారు. రామయ్యగారంగీకరించలేదు.

కుదరవల్లి నాగభూషణంగారు నిమ్మకూరు గ్రామవాసి. ఆయన తన పిల్లలిద్దరిని విజయవాడ గాంధీ మున్సిపల్ హైస్కూల్లో 1933వ సంవత్సరంలో చేర్పించారు. స్కూలుకు దగ్గరలో గడ్డి మార్కెట్టు దగ్గర నెలకు నాలుగు రూపాయల అద్దె చొప్పున ఒక పెంకుటింటిని మాట్లాడుకుని రామయ్య దంపతులు నిమ్మకూరు నుండి విజయవాడకు మకాం మార్చారు.

ఆ రోజుల్లో ఆరవతరగతికి నెలకి రెండు ముప్పావలా ఫీజు కట్టించుకునేవారు. రానురాను అదికూడా కట్టలేక పేద విద్యార్థుల తగ్గింపు ఫీజు క్రింద అప్లికేషన్ పెడితే ఫీజు తగ్గించారు.

1940వ సంవత్సరంలో హైస్కూలు విద్య పూర్తిచేసుకుని విజయవాడలోనే ఉన్న ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరారు. అప్పటికి రామయ్యగారికి వయస్సుపైబడింది ఓపిక తగ్గింది. దానికి తోడు కుటుంబ పోషణ కోసం కండక్టర్ ఉద్యోగం చేస్తూ పడి కాలు విరగ్గొట్టుకున్నారు అక్కడ గ్రామంలో కూడా పరిస్థితులు తల్లక్రిందులై ఉన్న పొలమంతా అమ్మేసారు లక్ష్మయ్యగారు. అన్నదమ్ములిద్దరు ఒక నిర్ణయానికి వచ్చారు. రామయ్య దంపతులు నిమ్మకూరులోనే ఉండి ఉన్న పొలం చూసుకునేటట్టు, లక్ష్మయ్య దంపతులు విజయవాడలో ఉండి పాలవ్యాపారం చేస్తూ తారకరాముడి చదువుపూర్తి చేయించేటట్టు. దానిమీద లక్ష్మయ్యగారు ఎకరం పొలం అమ్మేసారు. నాలుగు పాడి బర్రెలను కొని విజయవాడకు మకాం మార్చారు. అంతకు ముందున్న ఇల్లు చాలకపోవటంతో వెలగలేటివారి వీధిలో స్థలం అద్దెకు తీసుకుని రెండు నిట్టాళ్ళతో గట్టిపాక వేశారు.

తండ్రితోపాటు తెల్లవారు ఝామున మూడు గంటలకు లేవటం, పనుల్లో తండ్రికి సాయపడటం తరువాత పాలు తీసుకుని వెళ్ళి కాతాదారులకు పోసిరావటం, స్నానం చేసి వేడి వేడి జొన్నన్నం మీగడ పెరుగుతో తిని కాలేజికి వెళ్ళిపోవటం రామారావుగారు దినచర్యగా మారింది. మిత్రుల ప్రోద్బలంతో జిమ్‌ఖానాలో చేరి చక్కటి వ్యాయామం నేర్చుకున్నారు. పాలు తీసుకెళ్ళతం కష్టం కావటంతో లక్ష్మయ్యగారు సెకండ్‌హ్యాండ్ హెర్క్యులస్ సైకిల్‌ను ఎనిమిది రూపాయల పావలాకు కొనిపెట్టాడు. సహాధ్యాయులంతా దాన్ని 'హవాగాడి' అని ఎగతాళి చేస్తూండేవాళ్ళు. దానిమీదే నిమ్మకూరు వెళ్ళి బియ్యం, పప్పులు మోసుకొస్తూండేవారు. ఆ సైకిలు రామారావుగారికి తప్ప ఎవరిమాట వినేదికాదు. దాన్ని ఆయనెలా నడిపేవారో ఆశ్చర్యంగా ఉండేదట. ఎందుకంటే ఏ ఒక్కటీ సరిగా పనిచేసేది కాదు, బెల్లు, ఫెడల్, బ్రేకులు ఏవీ పనిచేయకపోయినా, మాంత్రికుడివశమైన దీపంలా వారి చేతిలో అది స్పీడుగా తిరిగేదట.

ఇక్కడ ఈ సైకిలుకు సంబంధించి అనేక సాహస సంఘటనలు ముడిపడున్నాయి. ఒకసారి నిమ్మకూరునుండి బియ్యం, కందిపప్పు, మిన్నప్పప్పు, మూటలు సైకిలుకు కట్టుకుని పామర్రు దగ్గరకు రాగానే టైరు పంచరయింది. ఉన్న ఒక్క రిపేరు షాపు మూతవేసి మెకానిక్ పక్క ఊరికి వెళ్ళాడని తెలుసుకుని రామారావుగారు ఏ మాత్రం ఆలోచించలేదు. మళ్ళీ వెనక్కుపోవటం అలవాటు లేదు. అందుకే అక్కడకు 35 కి.మీ. దూరం సైకిలుతో సహా మూటలు లాక్కుంటూ తెల్లవారు ఝాముకు విజయవాడ చేరుకున్నారు. ఆ స్థితిలో కొడుకుని చూసి వెంకట్రావమ్మగారు రోజంతా అన్నం మానేసి ఏడుస్తూ కూర్చున్నారట.

రామారావుగారికి జీవితం వడ్డించిన విస్తరికాదు - చదువు, ఇంటిపని, ఆర్థిక ఇబ్బందులు వీటన్నిటిని ఏనాడూ విసుక్కోకుండా చిరునవ్వుతో సాధించుకుని వచ్చారు. నిరంతర కృషీవలుడు. జీవితాన్ని గురించి పెద్ద ఆశలు లేకుండా కుటుంబాన్ని ఈడ్చారు. పైసా పైసా దాచి తల్లికి 'కాసులు పేరు' కొన్నరోజు చాలా ఆనందమనుభవించానని చెప్పారు. తరువాత వివాహం జరిగి రెండుసార్లు ఇంటర్మీడియట్ 1945లో తప్పారు. ఆ తర్వాత పట్టుదలతో పాసై గుంటూరు ఎ.సి కాలేజీలో బి.ఏలో చేరారు. ప్రతిరోజూ విజయవాడనుండి రైల్లో గుంటూరు వెళ్ళి వస్తుండేవారు. రైలు పాస్, అమ్మ ఇచ్చిన ఒక పావలా, టిఫిన్ బాక్స్, ప్రయాణం చేసినంతసేపు పాఠాలు చదువుతుండేవారు.

మూడు సంవత్సరాలలో డిగ్రీ పూర్తిచేయటమే కాదు, వెంటనే ఉద్యోగం కూడా సంపాదించారు. 1947లో మద్రాసు సర్వీస్‌కమీషన్ వారు నిర్వహించిన 'సబ్‌రిజిస్ట్రార్' పరీక్షలు రాసారు. వ్రాత పరీక్షకు హాజరయిన ఏడువందలమందిలో కేవలం ఏడుగురు

మాత్రమే ఎంపికయ్యారు. వారిలో రామారావుగారొకరు. ఉద్యోగం హోదా బాగానే ఉంటుందని తల్లిదండ్రులు సమ్మతించడంతో వెంటనే గుంటూరులో ఉద్యోగంలో చేరారు. జీతం, బత్తెం అంతా కలిపి నెలకు 190 రూపాయలు వచ్చేదట. అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి రెండు నెలలయింది.

ఉద్యోగంలో చేరటానికి వెళ్ళే తొలిరోజు ఆనందాన్ని ఎన్నేండ్లు గడచినా రామారావుగారు ఎంతో బాగా గుర్తుంచుకున్నారు. ఆర్థిక పరిస్థితి ఒకదారికి వస్తుంది. గౌరవమైన హోదా, తిరిగి తాతగారి ఇంటి పరువును నిలబెడుతున్నామన్న ఆనందం, చాలా నీతి, నిజాయితీలతో నిప్పులాంటి ఆఫీసరనిపించుకోవాలి అని ధృఢంగా ప్రమాణం చేసుకున్నారు.

***వివాహం:***

వెంకట్రామయ్యగారి పెత్తండ్రి కుమారుడు కాట్రగడ్డ చెంచయ్యగారు, కొమరువోలు మునసబుగారికి దత్తపుత్రుడిగా వెళ్ళి వారి తర్వాత తాను మునసబయ్యారు. వారి భార్య కృష్ణవేణమ్మగారు. వారికి నలుగురు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళు. అందరికంటే బసవతారకమ్మగారు పెద్దామె. ఆవిడ ఇంట్లోనే వ్రాయటం చదవటం వరకు చదువు నేర్చుకున్నారు. చిన్నతనం నుండి ఉత్తమ సంస్కారాన్ని తల్లి శిక్షణలో నేర్చుకున్న చాలా బుద్ధిమంతురాలని ఆమె పేరు తెచ్చుకున్నారు. "అందరి ఆదరాభిమానాల్లో అల్లారు ముద్దుగా పెరిగి కూడా అనేక కష్టాల్ని సహనంతో భరించిన ఉత్తమురాలు ఆమె" అంటారు రామారావుగారు. వివాహం తర్వాత వచ్చిన పేదరికాన్ని పెదవి కదపకుండా భరించారు. ఓర్పు, దయ, సంప్రదాయం ఆమెలో కలబోసుకుని ఉంటాయని చూసినవారు చెప్పారు. వీరి పెళ్ళి కూడా అనేక ఘర్షణల మధ్య జరిగింది. లక్ష్మయ్యగారి చినతమ్ముడు నాగయ్యగారి మరదల్ని రామారావుగారికిచ్చి పెళ్ళి చేయాలని వారు ప్రయత్నిస్తున్నారు. తల్లివైపు, తండ్రివైపు బంధువులు వారి వారి పిల్లనిచ్చి చెయ్యాలనే ప్రయత్నంలో బాగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ వివాహ విషయంలో కూడా రామయ్యగారు చంద్రమ్మగారు బసవతారకమ్మను చేయాలని పట్టుపట్టారు - అనేక గొడవల మధ్య చివరకు తల్లిదండ్రులు పెళ్ళికి రాకుండానే రామారావుగారి పెళ్ళి కొమరవోలులో జరిగిపోయింది. దాని పర్యవసానం మరోలా జరిగింది. అంతకు మునుపు లక్ష్మయ్యగారు నాగయ్యగారిని నమ్మి ముందుగానే డబ్బిచ్చి కొనుక్కున్న పొలన్ని ఈ వివాహ తగాదాల కారణంగా ఆయన రిజిష్టరు చేయకుండా ఎగ్గొట్టంతో లక్ష్మయ్యగారు క్రుంగిపోయారు. ఆ అవమానాన్ని చాలారోజుల వరకు ఆ కుటుంబం మర్చిపోలేకపోయింది. రామారావుగారు చిత్రపరిశ్రమలో నిలదొక్కుకున్న తర్వాత ముందుగా ఆ పొలాన్ని తర్వాత అంతకుముందు తండ్రి పోగొట్టుకున్న మిగిలిన మొత్తం పొలాన్ని కొని లక్ష్మయ్యగారి పేర రిజిష్టరు చేసేంతవరకు ఆయన గుండె మంట చల్లారలేదు. ఆ విధంగా పితృ ఋణం తీర్చుకుని, పెద్దకొడుకుగా పుట్టినందుకు తన పేరు సార్థకం చేసుకున్నారు.

రామస్వామి చౌదరిగారి కుటుంబంలో కాలక్రమంలో అందరూ ఆర్థికంగా చితికిపోయి, వంశగౌరవం దెబ్బతింటున్న పరిస్థితుల్లో రామారావుగారు స్వంత కష్టంతో పైకి వచ్చి నిమ్మకూరులోని ఆస్తిపాస్తులకంటే ఎక్కువగా పొలాలు, ఇల్లుకొని వంశ ప్రతిష్టను తిరిగి నిలబెట్టారు. తల్లికోల్పోయిన నగలతో పాటు పదింతలు ఎక్కువ చేయించి మాతృఋణం తీర్చుకున్నారు. చదువు సంధ్యలంతగా అబ్బని తమ్ముడికి ఉన్న పొలమంతా ఇచ్చి పెళ్ళి తానే జరిపించారు. తరువాత సినిమారంగంలో కూడా పెద్ద నిర్మాతని చేశారు.

బి.ఏలో ఉండగానే రామారావుగారికి తొలి పుత్రోదయమయింది. ఆ బిడ్డకు రామకృష్ణ అని పేరు పెట్టుకున్నారు కాలక్రమంలో మరో పదకొండుమంది సంతానం కలిగారు. ఏడుగురు కొడుకులు, నలుగురు కుమార్తెలు. తొలిబిడ్డ రామకృష్ణ జబ్బుచేసి మరణించారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*